సాక్షి
తిరుపతి
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



ఆవేదన.. ఆత్మీయత

కోల్‌కతా ఘటనపై వైద్య విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. రక్షాబంధన్ సందర్భంగా సోదరులకు రాఖీ కట్టారు. - 8లో



సహజ ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తిరుపతి ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సోమవారం ఘనంగా ఓరియెంటేషన్ డే నిర్వహించారు. - 8లో



ఆక్రమణ తొలగింపు

నాయుడుపేటలోని అంబేడ్కర్ భవన్ స్థలంలో టీడీపీ నేతలు అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్‌ను అధికారులు తొలగించారు. - 8లో

న్యూస్‌రీల్

ఎస్‌బీఐ తీరుపై ఎస్వీయూ ఉద్యోగుల ఆగ్రహం



తిరుపతి సిటీ : ఖాతాలను స్తంభింపజేసిన ఎస్‌బీఐ తీరుపై ఎస్వీయూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు అధికారులు వ్యవహరించడంపై మండిపడుతున్నారు. ఏం చేయాలో తెలియక ఉద్యోగులు, పెన్షనర్లు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఉద్యోగుల, పెన్షనర్ల ఖాతాలను ఎస్‌బీఐ అధికారులు రెండురోజులుగా స్తంభింపచేయడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొంది. దీని వెనుక వర్సిటీ అధికారుల ఒత్తిడి, ప్రభుత్వ పెద్దల ఆదేశాలు ఉన్నాయంటూ ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో వేతనాలకు ప్రభుత్వ గెజిట్ రాకపోవడంతో బడ్జెట్ కేటాయింపులు జరగలేదు. దీంతో ఉద్యోగుల ఖాతాలకు వర్సిటీ అధికారులు డెవలప్‌మెంట్ అకౌంట్ నుంచి వేతనాలు జమచేశారు. జూన్, జూలై రెండు నెలల జీతాలు ప్రభుత్వం ఆలస్యంగా కేటాయించిన నేపథ్యంలో ఈ మొత్తాలను వర్సిటీ డెవలప్‌మెంట్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలనే ఉద్దేశంతోనే బ్యాంకు సిబ్బందిపై వర్సిటీ అధికారులు ఒత్తిడి తెచ్చారు. దీంతో ఉద్యోగుల అకౌంట్లను బ్యాంకు అధికారులు హోల్డ్‌లో పెట్టేశారు.దీనిపై మంగళవారం వరకు వేచిచూసి అనంతరం న్యాయ పోరాటానికి ఉద్యోగులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

సంస్కృతి పరిరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న వేదిక్ వర్సిటీ వీసీ

తిరుపతి సిటీ: భారతీయ సంస్కృతి పరిరక్షణ, సంస్కృత భాషాభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి పిలుపునిచ్చారు. వర్సిటీలో వారం రోజులు నిర్వహిస్తున్న సంస్కృత వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ శ్రావణ పౌర్ణమిరోజు సంస్కృత దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. సరళ సంస్కృత భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత భాషను సామాన్య ప్రజలకు చేరువ చేసేందుకు బాల వికాస కేంద్రాలతో పాటు, జ్యోతిష్యం, వాస్తు, యోగా, కర్మకాండ, ఆలయ సంస్కృతి తదితర శాస్త్రాలపై సందేహాల నివృత్తి చేసేందుకు కన్సల్టెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విజయనగరానికి చెందిన ఎస్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నారాయణం నాగేశ్వరరావు, బెంగళూరు ఎడ్యుయాక్ట్ ఇన్నోవేషన్ ల్యాబ్ అధినేత శ్రీరామచంద్రధర్, డీన్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ సీహెచ్ నాగరాజు, ఉదయాన హెగ్డే పాల్గొన్నారు.

ఫలించిన పరిశోధన

దేశంలో వ్యవసాయరంగం అభివృద్ధికి తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్తలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఎప్పటికప్పుడు సరికొత్త వంగడాలు సృష్టిస్తున్నారు. అధిక దిగుబడులకు బాటలు వేస్తున్నారు. రైతులు ఆదాయ మార్గంలో పయనించేలా దిశానిర్దేశం చేస్తున్నారు. ఆధునిక పరిజ్ఞానంతో పరిశోధనలు చేపట్టి జాతీయ స్థాయి గుర్తింపు సాధించారు. ఈ క్రమంలోనే తాజాగా కోణార్క్–1707 పేరుతో వేరుశనగ వంగడం ఆవిష్కరించారు. నవీన విత్తనంతో ప్రయోగాత్మకంగా పలు రాష్ట్రాల్లో సాగు చేయించి అద్భుత ఫలితాలు రాబట్టారు.





తిరుపతి సిటీ : రైతులకు అధిక దిగుబడినిచ్చే సరికొత్త వంగడాలను రూపొందించి అభివృద్ధి చేసే లక్ష్యంతో తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల ప్రాంగణంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం(ఆర్‌ఏఆర్‌ఎస్) పనిచేస్తోంది. 1968లో ఏర్పడిన ఈ సెంటర్ అంచెలంచెలుగా ఎదుగుతూ 1979లో నేషనల్ అగ్రికల్చరల్ ప్రాజెక్ట్‌గా రూపాంతరం చెందింది. తదనంతరం పరిశోధనల్లో జాతీయ స్థాయి గుర్తింపు సాధించి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రంగా విలసిల్లుతోంది. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ (ఏడీఆర్) వి.సుమతి ఆధ్వర్యంలో సుమారు 20 మంది ప్రధాన శాస్త్రవేత్తలు ఆర్‌ఏఆర్‌ఎస్ (రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్)లో పనిచేస్తున్నారు. పప్పుదినుసులపై నిర్విరామ పరిశోధనలతో పాటు జీవన ఎరువుల ఉత్పత్తి తయారీ కేంద్రాలు సైతం ఆర్‌ఏఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.

యాజమాన్య పద్ధతులపై సూచనలు

ఆర్‌ఏఆర్‌ఎస్ ద్వారా ప్రతి ఖరీఫ్, రబీ సీజన్‌లలో సుమారు 50వేల మంది రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. పంట విత్తిన నాటి నుంచి నూర్పిడి వరకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను క్రమం తప్పకుండా వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా సలహాలను శాస్త్రవేత్తలు అందిస్తున్నారు. పరిశోధనా క్షేత్రంలో రైతు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి భూసార పరీక్షలు, ఉత్పత్తి విక్రయం, మార్కెట్ స్థితిగతులు, విత్తన పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. దేశంలోని పలువురు ప్రధాన శాస్త్రవేత్తలతో జాతీయ సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు పంటల సాగులో నవీన విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు. అగ్రి ఇంక్యుబేటర్ సెంటర్ ద్వారా విద్యార్థులు, రైతులు, ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తూ వారిలో సృజనాత్మక శక్తిని వెలికితీసి స్టార్టప్స్ ఏర్పాటుకు పరిశోధనా స్థానం కృషి చేస్తోంది.

నిర్విరామ కృషి

తిరుపతి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఇప్పటి వరకు సుమారు 19 రకాల వంగడాలను అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక కొత్తరకం విత్తనాన్ని అభివృద్ధి చేయాలంటే కనీసం సుమారు 7 ఏళ్ల నుంచి 10 ఏళ్ల పాటు శాస్త్రవేత్తల నిర్విరామంగా కృషి చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు వాతావరణం, ఉష్ణోగ్రతల్లో మార్పులు, వర్షాభావం, భూసారం, జీవద్రవాలు, చీడపురుగుల నివారణ వంటి వాటిపై దీర్ఘకాలిక పరిశోధనలు జరపాల్సి ఉంటుంది. సుదీర్ఘ పరిశోధనల అనంతరం నూతన విత్తనాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకువస్తారు. క్రొత్తగా రూపొందించిన వంగడాలపై రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించి ప్రోత్సహిస్తుంటారు.

వేరుశనగలో మరో కొత్తరకం



ఇటీవల ప్రధాని మోదీ చేతుల మీదుగా విడుదల చేసిన కోణార్క్ రకం విత్తనాలు

ఆర్‌ఏఆర్‌ఎస్ మరో కొత్త రకం వేరుశనగ విత్తనాలను రూపొందించి రికార్డు సృష్టించింది. జీపీబీడీ–4, ఎఫ్‌డీఆర్‌ఎస్–79 రకాల సంకరం ద్వారా వృద్ధి చేసి నూతన కోణార్క్ టీసీజీఎస్–1707 రకం విత్తనాలను రూపొందించారు. ఈ విత్తనాలను ప్రయోగాత్మకంగా ఒడిశా, పశ్చిమ బంగాలో రైతులకు పరిచయం చేసి అధిక దిగుబడిని సాధించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అనుకూలంగా ఉండే ఈ విత్తనాలు హెక్టార్‌కు సుమారు 25 క్వింటాళ్లకు పైగా దిగుబడిని అందించి జాతీయ స్థాయిలో రైతుల దృష్టిని ఆకర్షించాయి. దీంతో ఈనెల 11వ తేదీన ఢిల్లీలో కోణార్క్ రకం వేరుశనగ వంగడాలను ప్రధానమంత్రి మోదీ చేతులమీదుగా ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు. అలాగే కదిరి–6, ఎఫ్‌డీఆర్‌ఎస్–79 సంకరం ద్వారా 2022లో విశిష్ట టీసీజీఎస్–1694 చిన్నగుత్తి రకం వేరుశనగ విత్తనాలను కనుగొన్నారు. దీంతో పాటు 2023లో తిరుపతి–4, కె–9 రకాలను సంకరం చేసి హిమనీ టీసీజీఎస్–1522 అనే నూతన రకం వంగడాన్ని రూపొందించారు.



ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి వెలువడిన నూతన వేరుశనగ విత్తనాలు

రైతు సంక్షేమమే లక్ష్యం



రైతుల సంక్షేమం కోసం పరిశోధనా క్షేత్రంలోని ప్రతి శాస్త్రవేత్త నిర్విరామంగా కృషి చేస్తున్నారు. నీటి ఎద్దడిని, చీడపురుగులు, నేల, వాతావరణ పరిస్థితులను ఎదుర్కొని రైతుకు అధిక దిగుబడినిచ్చే రకాలను రూపొందించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నాం. ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్రస్తుతం మరిన్ని పరిశోధనలు కొనసాగుతున్నాయి. కోణార్క్ రకం అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తల సమష్టి కృషి అభినందనీయం.
– వి.సుమతి, ఏడీఆర్, ఆర్‌ఏఆర్‌ఎస్, తిరుపతి

భవిష్యత్‌లో మరిన్ని సృష్టిస్తాం



ఆర్‌ఏఆర్‌ఎస్‌లో నిపుణులైన శాస్త్రవేతలకు కొదవ లేదు. రైతులకు అధిక దిగుబడినిచ్చే ఆరోగ్యకరమైన పంటలను అందించే వంగడాలపై పరిశోధనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగానే కోణార్క్ రకాన్ని అభివృద్ధి చేశాం. ఫలితాలను చూస్తుంటే గర్వంగా ఉంది. ప్రభుత్వం సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని సరికొత్త వంగడాలను సృష్టిస్తాం.
– డాక్టర్ జాన్, ప్రధాన శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్‌ఎస్

అధునాత సాంకేతికతో..



ఆర్‌ఏఆర్‌ఎస్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు జరుగుతున్నాయి. కోణార్క్ రకం వేరుశనగ విత్తనాలు ఒడిశా, పశ్చిమ బంగా రాష్ట్రాల్లో రైతులకు లాభసాటి దిగుబడిని అందించాయి. ఈ విషయం గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మరిన్ని రాష్ట్రాల్లో కోణార్క్ విత్తనాలు రైతులకు అందించాలని సంకల్పించింది. ప్రధాని చేతులమీదుగా ఈ వంగడాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉంది.
– శ్రీవిద్య, శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్‌ఎస్

తూతూమంత్రంగా 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను అధికారులు తూతూమంత్రంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ వెళ్లిపోవడంతో డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రామ్మోహన్ గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. ఈ క్రమంలో కేవలం 25శాతం మంది అధికారులు మాత్రమే వచ్చారు. వివిధ సమస్యల వచ్చిన ప్రజల నుంచి అర్జీలను డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రామ్మోహన్ స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌కు మొత్తం 101 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహణ తీరుపై అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.



అర్జీలు పరిశీలిస్తున్న అధికారులు

పోలీస్ గ్రీవెన్స్‌కు 50 వినతులు

తిరుపతి క్రైం : జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి 50 వినతులు వచ్చినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. వాటిని వెంటనే పరిష్కరించి తీసుకున్న చర్యలపై నివేదికను తమ కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

అభివృద్ధి ఊసెత్తని సీఎం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం చంద్రబాబు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామికవాడకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నియోజకవర్గ ప్రజలు, టీడీపీ క్యాడర్‌కు నిరుత్సాహాన్నే మిగిల్చింది. 3 గంటల పాటు జరిగిన పర్యటనలో ఎక్కడా సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి గురించి నోరెత్తకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్ 20న సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్యవేడులో చంద్రబాబు సభ నిర్వహించారు. అందులో అనేక హామీలు గుప్పించారు. అధికారంలోకి వస్తే సత్యవేడులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. సత్యవేడు, వరదయ్యపాళెం పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేస్తామని నమ్మబలికారు. దాసుకుప్పం, సత్యవేడుకు బైపాస్ రోడ్లు నిర్మిస్తామన్నారు. సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆస్పత్రిగా (100 పడకలు) తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఆర్ అండ్ బీ రోడ్లను అద్భుతంగా తయారుచేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక తొలిసారి సత్యవేడు నియోజకవర్గ పర్యటనకు చంద్రబాబు రావడంతో ఆ హామీల ప్రస్తావన తీసుకువస్తారేమో అని ప్రజలు ఎదురు చూశారు. ఆ ఊసే ఎత్తకపోవడంతో అవాక్కయ్యారు. బాబు నైజం అంతే అని.. ఎన్నికల ముందు ఒకలా.. తర్వాత మరోలా ఉండడం ఆయనకు అలవాటే వ్యాఖ్యానించడం గమనార్హం.

కూటమి నేతలకు షాక్

సీఎం చంద్రబాబు పర్యటనకు తరలివచ్చిన కూటమి నేతలకు పోలీసులు షాక్ ఇచ్చారు. కేవలం 10 మందికి మాత్రమే పాస్‌లు జారీ చేయడంతో మిగిలివారికి చంద్రబాబును కలిసే అవకాశం దక్కలేదు. కనీసం హెలీప్యాడ్ వరకైనా పంపమని విన్నవించినా పోలీసులు పట్టించుకోకుండా నెట్టేశారు. బీజేపీ, జనసేన నేతల్లో ఒక్కరికి కూడా పాస్ ఇవ్వకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆశలు నేలపాలు

- పాడికి 'పచ్చ' పోటు • నేటి నుంచి పాల సేకరణ నిలిపేస్తున్న అమూల్
- 2,320 మందికి నష్టం • ఆందోళనలో రైతులు

రైతులకు మంచి జరుగుతున్నా.. మాకు అవసరం లేదు. పాడి పరిశ్రమకు మేలు చేకూరుతున్నా.. మాకేం పట్టదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందా..? ఆ కార్యక్రమం రద్దు చేయాల్సిందే..! ఇదే లక్ష్యంతో కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేస్తోంది. కక్షపూరితంగా వ్యవహరిస్తూ చివరకు అన్నదాతల ఆశలను నేల'పాలు' చేస్తోంది. తమ సొంత హెరిటేజ్ మనుగడ కోసం మహిళల నోట్లో మట్టికొడుతోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం వేధింపులు తాళలేక అమూల్ సంస్థ పాల సేకరణను నేటి నుంచి నిలుపుదల చేస్తోంది. ఈ మేరకు సమాచారం అందడంతో పాడి రైతుల్లో ఆందోళన అధికమైంది.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాడి రైతులు (ఫైల్)

తిరుపతి అర్బన్ : పాడి రైతుల నుంచి అమూల్ సంస్థ చేపట్టిన పాల సేకరణ నిలుపుదల చేయించాలని కక్ష గట్టిన పచ్చ నేతలు ఎట్టకేలకు తమ పంతం నెగ్గించుకున్నారు. టీడీపీ కుట్రతో పాడి రైతుల నుంచి పాల కొనుగోలుకు అమూల్ వారు వెనకడుగు వేశారు. తమ సంస్థకు (హెరిటేజ్) ప్రయోజనం చేకూర్చడానికి టీడీపీ నేతలు పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయించిన అమూల్ సంస్థ పాల డెయిరీని మూతవేయించారు. దీంతో జిల్లాలో మంగళవారం నుంచి అమూల్ సంస్థ పాల సేకరణ నిలిపివేస్తున్నట్లు పాడి రైతులకు సమాచారం ఇచ్చింది. ''మమ్మల్ని క్షమించండి.. ఈనెల 21వ తేదీ నుంచి పాలు కొనుగోలు చేయలేకపోతున్నందుకు ఎంతగానో చింతిస్తున్నాం'' అంటూ అమూల్ నుంచి పాడి రైతుల మొబైల్స్‌కు సమాచారం వచ్చింది. దీంతో జిల్లాలో 2,320 మంది పాడి రైతులకు చెందిన 20వేల లీటర్ల పాలు ఎవరికి ఇవ్వాలో తెలియని దుస్థితి దాపురించింది.

ఐదు మండలాల్లో పాల సేకరణ

జిల్లాలోని వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో 2,320 మంది పాడి రైతుల నుంచి రోజుకు 20వేల లీటర్ల పాలను అమూల్ సంస్థ కొనుగోలు చేస్తోంది. అయితే అమూల్ సంస్థను మూత వేయిస్తే...ఆ పాలు హెరిటేజ్ సంస్థకు వస్తాయని టీడీపీ పెద్దలు కుట్రచేశారంటూ పాడి రైతులు మండిపడుతున్నారు.



అమూల్ సంస్థకు పాలు పోస్తున్న మహిళ (ఫైల్)

గిట్టుబాటు ధర

గత ప్రభుత్వం చొరవతో పాడి రైతుల నుంచి అమూల్ సంస్థ నేతృత్వంలో పాలను కొనుగోలు చేసే కార్యక్రమాన్ని దశల వారీగా ప్రారంభించారు. లీటర్ ఆవు పాల ధర రూ.34 నుంచి 43 వరకు, బర్రె పాల ధర రూ.43 నుంచి 80 వరకు కొనుగోలు చేసేవారు. అయితే అమూల్ సంస్థను నిలుపుదల చేయడంతో మళ్లీ ఆవు పాలు లీటర్ రూ.20 నుంచి 22కి, బర్రె పాలు లీటర్ రూ.25 నుంచి 28కి ఇవ్వాల్సిన దుస్థితి వస్తోందని పాడి రైతులు వాపోతున్నారు.

ఇంద కక్ష ఎందుకు..?



పాడి రైతులపై ఈ ప్రభుత్వానికి ఇంత కక్ష ఎందుకో అర్థం కావడంలేదు. బర్రెలకు కడుపునిండా గడ్డితో పాటు ఇతర ఆహారం పెట్టడం పాల ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ మాత్రమే మాకు తెలుసు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మాకు పశుపోషణ తప్ప ఇంకేమీ తెలియదు. అయితే హఠాత్తుగా అమూల్ సంస్థ పాల సేకరణ నిలుపుదల చేస్తున్నట్లు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాం. ఇది న్యాయం కాదని భావిస్తున్నాం. ప్రభుత్వం తిరిగి అమూల్ సంస్థ ద్వారానే పాల సేకరణ ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం. – రూప, పాడి రైతు

మా బాధలు గుర్తించలేదు



పాడి రైతులకు అమూల్ సంస్థ వారు గిట్టుబాటు ధర ఇచ్చేవారు. గతంతో పోల్చుకుంటే అమూల్ సంస్థ ద్వారానే లాభాలు వస్తున్నాయి. కష్టపడి పాలు పోసినందుకు గిట్టుబాటు ధర వస్తోందని ఆశ పడ్డాం. అయితే ఇలా కుట్ర చేసి మా బతుకులపై దెబ్బకొట్టారు. అమూల్ వారు ఏ రోజు రేటు ఆ రోజు లెక్కించి ఇచ్చేవారు. అంతేకాదు బ్యాంక్ రుణాలు ఇప్పించేవారు. ఇతర డెయిరీలతో పోల్చుకుంటే అమూల్ అధిక ధర ఇస్తోంది. ఇప్పుడు పాల సేకరణ నిలిపేస్తే మేము బ్యాంక్ రుణాలు ఎలా కట్టాలి. మా బాధలను ప్రభుత్వం గుర్తించలేదు. – భావన, పాడి రైతు

అన్యాయం చేశారు



మేము ఏడాదిగా కష్టపడి అమూల్ సంస్థకు పాలు పోస్తున్నాం. మంచి రేటు వస్తోందని పాల ఉత్పత్తులను పెంచుకోవడానికి మరిన్ని పశువులను కొనుగోలు చేశాం. అయితే ప్రభుత్వం మారడంతో అమూల్ సంస్థ పాల సేకరణ లేదంటే మేము ఏం చేయాలి. కేవలం పాలమ్ముకునే బతుకుతున్నాం. బ్యాంక్ రుణాలు తీసుకుని రూ.లక్షలతో పాడి పశువులను కొనుగోలు చేసుకున్నాం. ఈ సమయంలో ఎవరికి పాలు పోసినా గిట్టుబాటు ధర ఇస్తారనే నమ్మకం లేదు. టీడీపీ నేతలు మాకు అన్యాయం చేశారు. – గౌతమి, పాడి రైతు

క్లుప్తంగా

పీటీసీ ప్రిన్సిపల్‌గా సుబ్రమణ్యం



చంద్రగిరి : కల్యాణీ డ్యామ్ సమీపంలోని పోలీసు ట్రైనింగ్ కళాశాల(పీటీసీ) ప్రిన్సిపల్‌గా సుబ్రమణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ ఎంతో అవసరమని, ఆ దిశగా శిక్షణను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఉపకర్మ ఉత్సవం



ఉపకర్మ ఉత్సవంలో వీసీ, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ వేద భాష్యం విభాగం ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీలోని నైమిషారణ్యంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా ఉపకర్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొని శ్రావణ పూర్ణిమ విశిష్టతను, మానవులు చేయాల్సిన కర్తవ్యాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆ విభాగం అధ్యక్షులు డాక్టర్ నిరంజన్ మిశ్రా, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజ చేశారు. అనంతరం చందనం, నారికేళ, పసుపు, కుంకుమ, విభూది తదితరాలతో అభిషేకాలు చేశారు. సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

తిరుమలకు మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన నిందితుడు

తిరుపతి క్రైమ్ : తిరుమలకు మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద విజిలెన్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. తిరుమలలోని ఒక ప్రైవేట్ హోటల్లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్న మురళి 10 మద్యం బాటిళ్లను తీసుకుని తిరుమలకు వెళుతున్నట్లుగా విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సాక్షి ఎఫెక్ట్..

• ఆలయ నిర్మాణం



తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం కాలూరు గ్రామంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం పనులు పునఃప్రారంభమయ్యాయి. గ్రామస్తుల చందాలు వేసుకుని మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్‌కు తోడుగా దేవదాయశాఖ నిధులతో రామాలయం నిర్మిస్తున్నారు. స్థానిక టీడీపీ నేతలు కొందరు గుడి స్థలం కబ్జా చేయాలని ప్రయత్నిస్తూ ఆలయ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీనిపై ఈ నెల 7వ తేదీన రామాలయానికి 'పచ్చ'గ్రహణం పేరిట 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై సర్పంచ్ మొక్కల భారతి స్పందించారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు, దేవదాయశాఖ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డితో మాట్లాడారు. అధికార పార్టీ ఒత్తిడితో ఆలయ నిర్మాణ పనులు నిలిపివేయడంపై ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం నుంచి ఆలయ నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. అయితే కూలీలు అడ్డుకునేందుకు టీడీపీ నేతలు ప్రయత్నించగా, స్థానికులు తిరగబడడంతో వెనుదిరిగారు. ఎట్టకేలకు ఆలయ నిర్మాణం మొదలుకావడపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– తిరుపతి రూరల్

• ఆక్రమణల తొలగింపు



నాయుడుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ భవన్‌కు చెందిన స్థలం ఆక్రమించి టీడీపీ నేతలు వేసిన రేకుల షెడ్‌ను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. "ఆక్రమణ.. అంబేడ్కర్ ఆవరణ" పేరిట 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి స్పందించారు. వెంటనే సిబ్బందితో కలిసి అంబేడ్కర్ భవన్ వద్దకు చేరుకుని దగ్గరుండి షెడ్‌ను తొలగింపజేశారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో కబ్జాకు గురైన మున్సిపల్ స్థలాలను స్వాధీనం చేసుకుంటామని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

– నాయుడుపేటటౌన్

జీతాలివ్వండి బాబూ..

సర్కారు బడుల్లోని చిరుద్యోగులు జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. కంటి మీద కునుకేయకుండా కాపు కాసినా ఈ ప్రభుత్వానికి కనికరం లేదు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తోంది. వారి కుటుంబ పోషణకు వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో చిరుద్యోగుల ఆకలి కేకలు వినేవారే కరువయ్యారు. గత ప్రభుత్వ హయాంలో నెల మొదట్లోనే జీతాలందడంతో వారి కుటుంబపోషణ సాఫీగా సాగిపోయింది. ప్రస్తుతం వారికి జీతాలు అందక అవస్థలు పడాల్సిన దుస్థితి ఎదురవుతోంది.



చిరుద్యోగుల వేతన సమస్య, డిమాండ్లు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు (ఫైల్)

నాలుగు నెలలుగా జీతాలు లేవు

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,908, ప్రాథమికోన్నత పాఠశాలలు 206, ఉన్నత పాఠశాలలు 330 మొత్తం 2,444 పాఠశాలలున్నాయి. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,818, ప్రాథమికోన్నత పాఠశాలలు 195, ఉన్నత పాఠశాలలు 281 మొత్తం 2,294 పాఠశాలలున్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మన్‌లకు నాలుగు నెలలుగా జీతాలివ్వడం లేదు. ప్రభుత్వం ఆయాలకు రూ.11.84 కోట్లు, వాచ్‌మెన్‌లకు 8.72 కోట్లు నిధులను మంజూరు చేయాల్సి ఉంది.



• చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరులోని జెడ్పీ హైస్కూల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 310 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో మరుగుదొడ్ల శుభ్రత కోసం ఇద్దరు ఆయాలను, నైట్ వాచ్‌మెన్‌ను నియమించారు. వారికి గత ఏప్రిల్ నుంచి జీతాలు ఇవ్వడం లేదు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆ చిరుద్యోగులు తమ సమస్యను ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు.



• తిరుపతి జిల్లా చంద్రగిరిలోని బాలికల జెడ్పీ హైస్కూల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 660 మంది చదువుతున్నారు. ఈ పాఠశాలలో ముగ్గురు ఆయాలు, ఒక వాచ్‌మెన్ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి గత నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీతాలను వెంటనే విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

- చిరుద్యోగుల ఆకలి కేకలు
- ప్రభుత్వ బడుల్లోని ఆయా, వాచ్‌మెన్‌లకు జీతాలు పెండింగ్
- కుటుంబం గడవక అవస్థలు పడుతున్న వైనం
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆయాల నిరీక్షణ
- పట్టించుకోని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇల్లు గడవడం కోసం పాఠశాలల్లో పారిశుధ్య పనులకు చేరారు. గత ప్రభుత్వ హయాంలో నెల మొదట్లోనే పారిశుధ్య కార్మికులకు జీతం ఇచ్చేసేవారు. కుటుంబం గడుస్తుందనే ఆశతో వేలాది మంది ఆయాలుగా, వాచ్‌మెన్‌లు పనిచేస్తున్నారు. అయితే వారిపై కొత్త ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. వారు చేసే కష్టాన్ని ఏ మాత్రం గుర్తించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. వారి ఆకలి కేకలు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు పెండింగ్‌లో పెట్టారు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రభుత్వ బడుల్లో విధులు నిర్వహిస్తున్న ఆయా, నైట్ వాచ్‌మెన్‌ల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినపడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేసి కుటుంబ పోషణ

నెలవారీగా ఆయాలకు, నైట్ వాచ్‌మెన్‌లకు జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వడ్డీలకు అప్పు తీసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. జీతాలపైనే ఆధారపడి జీవించే తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని వారు ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయాలకు, నైట్‌వాచ్‌మెన్‌లకు రూ.6 వేలు నెలకు ప్రభుత్వం జీతం మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్కొక్కరి రూ.24 వేలు జీతం పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడిస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల వివరాలు

చిత్తూరు జిల్లాలోని పాఠశాలలు	2444
తిరుపతి జిల్లాలోని పాఠశాలలు	2294
చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఆయాలు	2576
తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ఆయాలు	2361
చిత్తూరు జిల్లాలోని నైట్‌వాచ్‌మెన్‌లు	1756
తిరుపతి జిల్లాలోని నైట్‌వాచ్‌మెన్‌లు	1879

పట్టించుకోని ఉన్నతాధికారులు

జీతాల పెండింగ్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకుల సాయంతో కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించినప్పటికీ ఏ మాత్రం స్పందన లేదని చెబుతున్నారు. జీతల సమస్యపై వినతిపత్రం ఇస్తే ఏ మాత్రం ఉలుకూ పలుకూ లేదని కన్నీరు మున్నీరవుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న జీతాలను మంజూరు చేయించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జీతాలు పెండింగ్ తగదు



ప్రభుత్వ బడుల్లో పొట్ట కూటి కోసం పనిచేస్తున్న ఆయాలు, నైట్‌వాచ్‌మెన్‌ల జీతాలను నాలుగు నెలలుగా మంజూరు చేయకపోవడం దారుణం. ఈ కొత్త ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం సమంజసం కాదు. జీతాలు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను కలెక్టర్లు ప్రత్యేక చొరవతో పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.

– సురేంద్ర, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యాశాఖ అధికారులు స్పందించాలి



ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాల సమస్యను విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలి. చిరుద్యోగుల జీతాల మంజూరుపై ఈ కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నెల జీతం లేకపోవడంతో ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు వడ్డీకి అప్పులు తీసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఉండేది కాదు.

– సద్దాం, విద్యార్థి సంఘం నాయకుడు, చిత్తూరు జిల్లా

• ఆవేదన.. ఆత్మీయత





కోల్‌కత్తాలో జరిగిన అమానవీయ ఘటనపై వైద్యవిద్యార్థుల నిరసన కొనసాగుతోంది. సోమవారం తిరుపతిలో రుయా ఆస్పత్రి వద్ద ఎస్వీ మెడికల్ కళాశాల విద్యార్థినులు దీక్ష చేపట్టారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే రక్షాబంధన్‌ను పురస్కరించుకుని తోటి సోదరులకు ఆత్మీయత పంచారు. రాఖీ కట్టి అభిమానం చాటుకున్నారు.

– తిరుపతి తుడా

అక్రమాలకు 'పచ్చ'తోరణం

- చంద్రగిరిలో పోస్టింగ్ అంటేనే భయపడుతున్న అధికారులు
- టీడీపీ నేతల అవినీతి దాహానికి బలవుతున్న ఉద్యోగులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజకవర్గంలో పోస్టింగ్ అంటేనే అధికారులు పారిపోతున్నారు. మట్టి, ఇసుక స్మగ్లింగ్, భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లు, గంజాయి అక్రమ రవాణా ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. అవినీతి సంపాదనకు కాదేదీ అనర్హం అన్నట్లు రెచ్చిపోతున్న టీడీపీ నేతల కారణంగా తమ ఉద్యోగాలకు ఎసరువస్తుందని ఆందోళన చెందుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అండతో చెలరేగుతున్న పచ్చమూక దాష్టీకాలకు భయపడుతున్నారు. వారి అక్రమ సంపాదన కోసం ఎంతమందిని ఉద్యోగులనైనా టీడీపీ నేతలు బలి చేసేస్తున్నారు. ఎక్కడ నుంచో ఉద్యోగం చేయడానికి వచ్చిన ఎందరో అధికారులకు అవినీతి మరకలు అంటించేస్తున్నారు. ఫలితంగా ఉన్నతాధికారులు తీసుకునే చర్యలకు సామాన్య ఉద్యోగులు బలి కాక తప్పడం లేదు. తాజాగా ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి స్థానిక టీడీపీ నేతలు అక్రమంగా మట్టి రవాణా చేస్తుంటే.. ఆ టిప్పర్లకు అక్కడి పోలీసులే ఎస్కార్ట్‌గా వెళ్లారు. ఆ వీడియోలు కాస్త సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టడంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారి స్పందించారు. ఆ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. అదంతా నిజమని నిర్ధారణ కావడంతో ఎస్కార్ట్ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.మట్టి అక్రమ రవాణా ఘటనలో ముగ్గురు అధికారులు బలి కావడం చర్చనీయాంశమైంది. అంతేకాదు ఇసుక, భూముల ఆక్రమణలకు సంబంధించిన పలు కీలక సాక్ష్యాలు ప్రభుత్వ పెద్దలకు చేరడంతో మరికొందరు అధికారులు బలయ్యే అవకాశం కూడా కనిపిస్తోంది. ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో 160 మంది అధికారులు కోర్టు నోటీసులు తీసుకున్నారు. దీంతో కొత్తగా ఇక్కడ ఉద్యోగం చేయాలంటే ఎవరూ ముందుకు రావడం లేదని జిలాస్థాయి అధికారులే వ్యాఖ్యానిస్తూ ఉండడం గమనార్హం.


తప్పని తెలిసినా..

కొన్నిసార్లు తప్పని తెలిసినా అక్రమాలకు సహకరించక తప్పట్లేదని కొత్తగా వచ్చిన ఓ మండల స్థాయి రెవెన్యూ అధికారి తనను కలిసిన మీడియా ప్రతినిధులతో బహిరంగంగానే చెప్పడం విశేషం. ఈ క్రమంలోనే స్థానిక ప్రజాప్రతినిధి, ఆయన అనుచరుల ఒత్తిడితో ఎప్పుడు ఏమి తప్పు చేయాలో, చేసిన తప్పుకు ఏ శిక్ష పడుతుందో అన్న భయంతో ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. అత్యధిక శాతం మంది ప్రస్తుతం జరిగే సాధారణ బదిలీల్లో చంద్రగిరి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాలని గుట్టు చప్పుడు కాకుండా ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

మోసంలో 'హేమా'హేమీ!

- ఫైనాన్స్ సంస్థకు రూ.1.80లక్షల టోకరా
- ఎమ్మెల్యే అనుచరుడినంటూ బెదిరింపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన హేమచంద్రారెడ్డి మోసాల్లో ఆరితేరాడు. ఎమ్మెల్యే అనుచరుడిని అని చెప్పుకుంటూ హల్‌చల్ చేస్తుంటాడు. ఈ క్రమంలోనే సోమవారం విజయవాడకు చెందిన ఓ ఫైనాన్స్ కంపెనీ వారికి టోకరా వేశాడు. వివరాలు.. ముత్తూట్ ఫైనాన్స్‌లో 78.3 గ్రాముల బంగారు నగలను రూ.3.65లక్షలకు తాకట్టు పెట్టాని, విడిపించి తగిన రేటుకు తీసుకోవాలని విజయవాడకు చెందిన అశ్విత్ గోల్డ్ ఫైనాన్స్‌ను సంప్రదించాడు. వారు బంగారం కొనేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీకాళహస్తికి చేరుకున్నారు. అయితే అప్పటికి ముత్తూట్ ఆఫీస్ ఓపెన్ చేయకపోవడంతో హేమచంద్రారెడ్డి వెంటనే తన ప్లాన్ అమలు చేశాడు. ముందు తన ఖాతాకు రూ.1.80 లక్షలు జమ చేయాలని ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులను కోరాడు. తాను ఆన్‌లైన్ ద్వారా ముత్తూట్ వారికి నగదు పంపిస్తానని నగల తాకట్టు రశీదు ఇచ్చాడు. మీరు మిగిలిన మొత్తం చెల్లించి నగలు తీసుకోవచ్చని నమ్మించాడు. ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు తన ఖాతాలో నగదు జమ చేయగానే అక్కడ నుంచి ఉడాయించాడు. తాను ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడినని, మీ డబ్బు ఇక తిరిగి రాదని, ఏం చేసుకుంటారో చేసుకోండంటూ బెదిరించి బైక్‌పై జారుకున్నాడు.విజయవాడ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు దీనిపై ముత్తూట్ వారిని సంప్రదించగా, హేమచంద్రారెడ్డికి మోసగాడని, గతంతో ఇలాగే రెండు సంస్థలకు టోపీ పెట్టాడని వెల్లడించారు. ఈ మేరకు ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హేమచంద్రారెడ్డిపై ఇలాంటి వ్యవహారాల్లోనే గతంలో రెండు కేసులు నమోదైనట్టు పోలీసులు వెల్లడించారు. దీనిపై సీఐ గోపీని వివరణ కోరగా హేమచంద్రారెడ్డిపై విజయవాడకు చెందిన సంస్థ ప్రతినిధులు ఫిర్యాదు చేశారని తెలిపారు. నిందితుడిపై బలమైన కేసులు పెట్టనున్నట్లు వెల్లడించారు.



హేమచంద్రారెడ్డి ఖాతాలో నగదు డిపాజిట్ చేసిన స్లిప్

సహజ ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రసాద్

తిరుపతి సిటీ : ప్రకృతి సిద్ధంగా లభించే సహజ ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రకృతి వనం నిర్వాహకుడు ఎంసీవీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో శ్రీనివాస ఆడిటోరియంలో బీటెక్ తొలి ఏడాదిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉదయాన్నే స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించాలని, వర్షపు నీటి నేరుగా పట్టుకుని వాడుకోవాలని సూచించారు. పిజ్జా, బర్గర్‌లకు దూరంగా ఉంటూ రాగులు, సజ్జలు, జొన్నలతో కూడిన ఆహారాన్ని భుజించాలని కోరారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్వీయూలో సీటు సాధించడం విద్యార్థుల అదృష్టమని, నాణ్యమైన విద్య, చక్కటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. లక్ష్యం సాధించేందుకు నిరంతర కృషి అవసరమని సూచించారు. వార్డెన్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ దామోదర్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ మునిలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.